ప్రజాశక్తి
ఆదివారం 17 ఫిబ్రవరి 2024
5
విజయనగరం

డిఎస్‌డిఒగా వెంకటేశ్వరరావు

అచ్యుత్ కుమార్ కు విశాఖ బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావును విజయనగరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ డిఎస్‌డిఒగా ఉన్న అచ్యుత్ కుమార్‌ను విశాఖ గోపాలపట్నంలో ఉన్న ఇండోర్ స్టేడియంకు బదిలీ చేశారు. వెంకటేశ్వరరావుకు మన్యం జిల్లా ఇంఛార్జి బాధ్యతలు కూడా అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం పార్లమెంట్, శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో తక్షణమే మోడల్ కోడ్ అమల్లోకి వచ్చింది. దేశంలో 4 విడత ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోను, జిల్లాలోను ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల గడువు ఏప్రిల్ 25 కాగా, 26న పరిశీలన ఉంటుంది. 29 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 13న పోలింగ్ జరుగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మోగిన ఎన్నికల నగారా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఎన్నికల నిర్వహణ పనిలో నిమగ్నమైంది. ఓట్ల జాబితా మొదలుకుని, పోలింగ్ కేంద్రాలు గుర్తింపు, బూత్‌లు, అక్కడ సదుపాయాల కల్పన, పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించడం నామినేషన్లు దాఖలు చేసే విధానం, సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఇఆర్‌ఒలకు, నోడల్ అధికారులకు శిక్షణ వంటి ప్రక్రియ సుమారు మూడు నెలలుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి శనివారం 3గంటల నుంచే అమల్లోకి వచ్చింది. మరోవైపు ఎన్నికల ఏర్పాట్లు, డేటా సమకూర్చడం వంటి పనులు జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) నేతృత్వంలో అధికారులు మరింత ముమ్మరం చేశారు. అధికారిక సమాచారం ప్రకారం... జిల్లాలో మార్చి 5వ తేదీ వరకు 15,41,001 మంది ఓటర్లుగా నమోదు అయ్యారు, వీరిలో 7,60,400 మంది పురుషులు, 7,80,518 మంది మహిళలు, 83 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. వీరంతా తమ ఓటును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా 1172 ప్రదేశాల్లో మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 11 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా రూపొందించారు. వీటిలో రెండింటిని యువతకు, 7 కేంద్రాలను మహిళలకు, మరో రెండు పోలింగ్ స్టేషన్లను వికలాంగులకు కేటాయిస్తారు. ఎన్నికల సంఘం విధి విధానాల ప్రకారం పోలింగ్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లకు ఎండ నుంచి రక్షణ కోసం షామియానా, సహాయం చేసేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ బృందాల నియామకం, వాహనాలు, పోస్టల్ బ్యాలెట్లు సమకూర్చడం, ఇవిఎం తరలింపు, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ ఏర్పాటు, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలపై ఇప్పటికే అధికార యంత్రాంగం కసరత్తు చేసింది.

వెలువడిన షెడ్యూల్

- ఎన్నికల కోడ్ తక్షణం అమల్లోకి
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్
- ఓట్ల లెక్కింపు జూన్ 4
- 1847 పోలింగ్ కేంద్రాలు
- 15,41,001 మంది ఓటర్లు

పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎన్నికల్లో కొత్తగా హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టింది. దీనికోసం ఓటర్లు ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 85 ఏళ్ల వయసు పైబడినవారు, 45 శాతం వికలాంగత్వం ఉన్న వారు, కోవిడ్ బాధితులు తమ ఇళ్ల వద్దే ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిర్యాదుల కోసం 24 గంటలూ పనిచేసే కంప్లయింట్ సెల్‌ను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు : కలెక్టర్

కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సాధారణ, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టంచేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులంతా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశమై ఎన్నికల నేపథ్యంలో ఆయా శాఖలు పాటించాల్సిన నిబంధనలపై ఆదేశాలిచ్చారు. ప్రవర్తన నియమావళి అమలుకోసం ఆయా ప్రాంతాల్లో నియమించిన బృందాలు ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన నేతల ఫోటోలతో వున్న ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా అభివృద్ధి పనుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రారంభించి జరుగుతున్న పనులను కొనసాగించవచ్చుని, పనులు మంజూరైనప్పటికీ మొదలు కానట్లయితే వాటిని తాజాగా ప్రారంభించరాదని స్పష్టంచేశారు. వివిధ పథకాల లబ్దిదారులకు వాలంటీర్ల ద్వారా పంపిణీ కాకుండా మిగిలివున్న కార్డులను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయిన వరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

సిట్టింగ్‌లకే సీట్లు

ఎట్టకేలకు వెలువడిన వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా

అభ్యర్థుల్లో వీడిన ఉత్కంఠ • ప్రచారానికి రె'ఢీ'

ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

బెల్లాన చంద్రశేఖర్
విజయనగరం ఎంపి

బొత్స సత్యనారాయణ
చీపురుపల్లి అసెంబ్లీ

ఎస్‌విఎన్ అప్పలనాయుడు
బొబ్బిలి

డాక్టర్ తలే రాజేష్
రాజాం

బొత్స అప్పలనర్సయ్య
గజపతినగరం

బడ్డుకొండ అప్పలనాయుడు
నెల్లిమర్ల

కడుబండి శ్రీనివాసరావు
శృంగవరపుకోట

కోలగట్ల వీరభద్రస్వామి
విజయనగరం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాజాం, అరకు పార్లమెంట్ మినహా మిగిలిన అన్ని చోట్లా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు మరోసారి అవకాశం లభించింది. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించగా, అరకు ఎంపి అభ్యర్థిగా డాక్టర్ శెట్టి తనూజారాణిని ప్రకటించారు. ఇడుపులపాయలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైపిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎంపి అభ్యర్థుల పేర్లను, బాపట్ల ఎంపి నందిగామ సురేష్ ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. విజయనగరం నియోజకవర్గం నుంచి కోలగట్ల వీరభద్రస్వామి, చీపురుపల్లి నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, నెల్లిమర్ల నుంచి బడ్డుకొండ అప్పలనాయుడు, గజపతినగరం నుంచి బొత్స అప్పలనర్సయ్య, ఎస్.కోట నుంచి కడుబండి శ్రీనివాసరావు, బొబ్బిలి నుంచి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పేర్లను ఖరారు చేశారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులకు పాయకరావు పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో రాజాంలో తలే రాజేష్‌కు అవకాశం కల్పించారు. అటు జోగులకు కూడా పాయకరావుపేటలో పోటీకి పార్టీ అవకాశం కల్పించింది. విజయనగరం ఎంపీ అభ్యర్థిగా స్థానిక ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు టిక్కెట్ ఖరారు చేశారు. జిల్లా పార్టీ సమన్వయ కర్త, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మినహా మరెవ్వరూ టిక్కెట్లు ఆశించేవారు లేకపోవడం సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీలకు కలిసివచ్చింది. ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కోసం ఎదురు చూసిన శ్రీనివాసరావు కు మాత్రం ఒకింత నిరాశే ఎదురైంది. ఎట్టకేలకు వైసిపి అభ్యర్థులను పూర్తిస్థాయిలో ప్రకటించడం తో అభ్యర్థిత్వం ఎవరికి కల్పిస్తారో అన్న సందిగ్ధం వీడిపోయింది. పార్టీ నుంచి అధికారిక ప్రకటన రావడంతో అభ్యర్థులతోపాటు వారి అనుయా యులు ఆనంద డోలికల్లో మునిగి తేలుతున్నారు. పలుచోట్ల పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

ఒకరిద్దరు సిటింగ్ ఎమ్మెల్యేలపై ప్రజావ్యతిరేకత, అవినీతి ఆరోపణలు వున్నప్పటికీ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి వాటిని పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. సాలూరు నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. అరకు ఎంపీగా పోటీ చేయాలనే అభిప్రాయాన్ని ఆయన పలుమార్లు వ్యక్తం చేసినా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోలేదు. కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సిటింగ్ ఎమ్మెల్యేలైన పుష్ప శ్రీవాణి, కళావతిలకే మరోసారి అవకాశం దక్కింది. వీరిద్దరూ మూడోసారి కదనరంగంలోకి దూసుకుపోతున్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అరుకు పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ శెట్టి తనూజారాణిని అధిష్టానం ప్రకటించింది.

ఎస్.తనూజా రాణి
అరకు పార్లమెంట్

పీడిక రాజన్నదొర
సాలూరు

పి.పుష్పశ్రీవాణి
కురుపాం

అలజంగి జోగారావు
పార్వతీపురం

వి.కళావతి
పాలకొండ

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/కోట

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలు సైతం త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం కృషి ఎనలేనిదన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం అని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ అనిత, బిసి సంక్షేమ శాఖ అధికారి కిడారి సందీప్, డిఇఒ ప్రేమకుమార్, కలెక్టరేట్, బిసి సంక్షేమ శాఖ సిబ్బందిపాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌పి ఎం.దీపిక పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్వీన్ గారు, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజ మార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

లోక్ అదాలత్‌లో 1220 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

రాజీయే రాజ మార్గమని, వివిధ తగాదాలలో వ్యక్తుల మధ్య రాజీ కుదిర్చి ఇరు పార్టీలకు సమ న్యాయం చేయడం లోక్ అదాలత్ ధ్యేయమనింగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో లోక్ అదాలత్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను కాపాడు కోవాలాలని సూచించారు. లేనిపోని తగాదాలకు పోయి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగరాదని, కోర్టు లలో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అనవసర కలహాలుమాని పిల్లల భవిష్యత్ కోసం, మనమీద ఆధార పడ్డవారికోసం అహం వీడి రాజీకి రావాలని హితవు పలికారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. విజయనగరంలో 757, పార్వతీపురంలో 56, బొబ్బిలి 137, సాలూరు 76, శృంగవరపుకోట 52, గజపతినగరం 34, చీపురుపల్లి 31, కొత్తవలస 63, కురుపాం 14 కేసులు మొత్తంగా 1220 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. అదాలత్‌లో అధికంగా 129 మోటారు ప్రమాద బీమా కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రూ.2కోట్ల 43లక్షల 57వేల 61 రూపాయల మొత్తాన్ని కక్షి దారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదాలత్‌లో న్యాయమూర్తులు జి.రజని, ఎం.మీనాదేవి, సికెందర్ భాషా, ఎన్.పద్మావతి, కె.నాగమణి, వి.లక్ష్మికుమారి, బి.రమ్య, కె. మోహిదెన్ జమూరుత్ బేగం, జె. సౌమ్య జోసిఫెన్ , బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ దామోదర రామ్మోహనరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. కక్షిదారులకు సౌకర్యార్థం మెడికల్ క్యాంపు, భోజనాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఉత్తరాంధ్ర జిల్లాల కల్పవల్లి కనకమహలక్ష్మి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం అయ్యింది. ఈనెల 17, 18, 19 తేదీలలో అమ్మవారి జాతరను జరిపేందుకు ఆలయ కమిటీతో పాటు దేవాదాయశాఖ అధికారులు నిర్ణయించారు. అందుకు తగ్గట్లుగా జాతరకు అన్ని ఏర్పాట్లూ చేశారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు మూడు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన అమ్మవారి ఆలయ ప్రాంగణం

జాతరకు భారీ బందోబస్తు

జాతరకు సంబంధించి సుమారు 9వందల మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి చక్రవర్తి తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను స్థానిక సిఐ సిహెచ్ షన్ముఖరావు, ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండడంతో పాటు జాతర సజావుగా సాగేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ముగ్గురు డిఎస్‌పిలు, 8 మంది సిఐలు, 42 మంది ఎస్‌ఐలతో పాటు 8 వందల మంది పోలీసులను ఏర్పాటు చేసామన్నారు. అలాగే రెండు క్రైం టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్‌కు సంబంధించి చీపురుపల్లి పట్టణం వైపు పాత కోర్టు ప్రాంగణం, పంచాయతీ కార్యాలయ ప్రాంగణం, బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్, రావివలస జంక్షన్‌లో వాహనాలు నిలుపుకొనేందుకు ఏర్పాటు చేసామన్నారు. సరుకు రవాణా వాహనాలకు ఎటువంటి ఆంక్షలు లేవన్నారు. శ్రీకాకుళం నుండి వయా చీపురుపల్లి మీదుగా విజయనగరం వెళ్లాల్సిన వాహనాలు సుభద్రాపురం హైవే మీదుగా వెళ్లాలని డిఎస్‌పి సూచించారు. విజయనగరం నుండి చీపురుపల్లి మీదుగా వెళ్లాల్సిన వాహనాలు గరివిడి బ్రిడ్జి వద్ద నుండి ఉత్తరావల్లి మీదుగా వెళ్లాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో 15 సిసి కెమెరాలను ఏర్పాటు చేసామనితెలిపారు. ఆలయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్య ప్రకాశరావు, వైస్ చైర్మన్ సూరు కుమార్, ఇఒ జి.శ్రీనివాసరావులకు డిఎస్‌పి చక్రవర్తి సూచించారు.

రావణ పాలన అంతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ఒక రావణాసురుడు పాలన అంతమైందని విజయనగరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలంతా ఈ ఐదేళ్లలో ఒక రావణాసురుడు పాలన చూశారన్నారు ఆ పాలన నుంచి ప్రజలకు నేటి నుంచి విముక్తి కలిగిందన్నారు. వైఎస్‌ఆర్ సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో టిడిపి నాయకులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు అదేవిధంగా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత ఈ ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు రాష్ట్రంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. టిడిపి నాయకులు కర్రోతు బంగార్రాజు, ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్ బొద్దల నర్సింగరావు,గంటా పోలినాయుడు వి.శ్రీనివాసరావు , రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, నెలాఖరు నాటికి 100శాతం పన్నులు వసూలు చేసేందుకు సిబ్బంది, అధికారులు కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు అన్నారు. పన్నుల వసూలుపై రెవెన్యూశాఖ అధికారులు, అర్‌ఐలతో సమీక్షించారు. ఇప్పటి వరకు 50 శాతం కూడా పన్నులు వసూలు చేయకపోవడం సరికాదన్నారు. ముఖ్యంగా సచివాలయాల అడ్మిన్‌లు ఉదయం 11 గంటలకు వస్తే పన్నుల వసూలుకు ఎప్పుడు వెళ్లి వసూలు చేస్తారని ప్రశ్నించారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు, రాత్రి 8 గంటలకు ఆ రోజు వసూళ్లపై అడ్మిన్ల తో సమావేశం నిర్వహించి పన్నులు వసూలు పెంచాలన్నారు. పన్ను బకాయిదార్లు ఇళ్ల వద్ద ఉన్న సమయంలో వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్, రెవెన్యూ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్, ఆర్‌ఒ, అర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఎంఎం నాయుడు

పారిశుద్యానికి విఘాతం కలిగితే చర్యలు

నగరంలో పారిశధ్య పనుల విఘాతానికి పాల్పడితే చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు హెచ్చరించారు. శనివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాలలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో గమనించారు. దాసన్నపేటలో కొన్ని దుకాణాల ప్రాంతాలను పరిశీలించారు. కొంతమంది దుకాణదారులు చెత్తాచెదారాలను రహదారులపై విచ్చలవిడిగా వేయడంతో మందలించి అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలను రోడ్లపై వేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవసరమైతే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేసారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రారంభాల పరేషాన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఇటీవల చేసిన ప్రారంభోత్సవాలు జనాన్ని పరేషాన్ చేస్తున్నాయి. ఐదేళ్లు ఊరుకుని ఎన్నికలు దగ్గరపడిన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు హడావుడిగా పూర్తిచేయడం, కొన్ని ఇంకా పూర్తికాకుండానే మన జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎమ్మెల్యేలంతా కొద్ది రోజులుగా భవనాలు, రోడ్లు, కాలువలు, పార్కులు, బస్ షెల్టర్ల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కానీ, చాలా వరకు అసంపూర్తిగా ఉండడం, పూర్తిచేసిన వాటికి బిల్లులు విడుదల చేయక పోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లతో పాటు యావత్తు జిల్లా ప్రజానీకం విస్తుపోతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ తదితర భవనాలను ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో తలపెట్టారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు ఉండగా వీటిలో 498 సచివాలయ భవనాలు, 496 రైతు భరోసా కేంద్రాలకుగాను 291 భవనాలు, 311 వెల్‌నెస్ సెంటర్లకుగాను 178పూర్తి భవనాలు మాత్రమే నిర్మించాలని 2019లోనే ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. నిధులు విడుదల చేయక పోవడంతో

123 గ్రామ సచివాలయాలు, 126 రైతు భరోసా కేంద్రాలు, 133 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు చొప్పున మొత్తం 382 భవన నిర్మాణాలు రూఫ్‌లెవెల్, గోడలు, పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. చాలా వరకు ఏళ్ల తరబడి మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. మరో 32 గ్రామ సచివాలయాలు, 79ఆర్‌బికెలు, 124 విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల చొప్పున ఈ మూడు విభాగాలకు చెందిన 235 భవనాలకు కనీసం ప్రతిపాదనలు కూడా లేవు.

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ సచివాలయ భవనాలకు గానూ, 253భవనాల పనులు ప్రారంభించగా, 125 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 301 ఆర్‌బికె భవనాలకు గాను, 178 నిర్మాణాలు చేపట్టగా, 100 మాత్రమే పూర్తైయ్యాయి. 192 విలేజ్ క్లీనిక్ భవన సముదాయాలు చేపట్టగా ఇందులో చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం భవన నిర్మాణాలకు సంబంధించి రూ.10కోట్ల వరకు బకాయి ప్రభుత్వం నుంచి రావాల్సివున్నట్టు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో సచివాలయ, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాల బకాయిలు సంక్రాంతిలోపే చెల్లిస్తామని, పనులు ముమ్మరం చేయాలని అంటూ జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పంచాయతీరాజ్ శాఖ అధికారులకు హామీ ఇచ్చినప్పటికీ, ఆ మాట ప్రకారం నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. అక్కడక్కడ పూర్తయిన భవనాలను మంత్రి, ఎమ్మెల్యేలు గడిచిన 15రోజులుగా తెగేసి ప్రారంభాలు చేసినప్పటికీ వాటికీ బిల్లులు చేయడంలో విఫలమయ్యారు. మరోవైపు విజయనగరంలోని పలు పార్కులు, బస్ షెల్టర్లు పూర్తికాకముందే డిప్యూటీ స్పీకర్ ప్రారంభోత్సవాలు చేయడం పట్ల జనం ఔరా...! అంటూ విస్తుపోతున్నారు.

జీతాలు చెల్లించేందుకు కమిషనర్ హామీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడుకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం సమర్పించారు. కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు , శ్రీ సిరి కన్స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ రాంప్రసాద్‌ను పిలిపించి యూనియన్‌తో చర్చలు జరిపారు. 2023 జూలై నుంచి బిల్లులు సిఎస్ఎఫ్ఎం లో పెండింగ్ ఉన్నాయని, అవి మంజూరయ్యేలోగా ప్రత్యామ్నాయ ఆలోచన చేసి నెలాఖరుకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2022 సెప్టెంబర్ వేతనంతో పాటు, 2023 జూలైలో చెల్లించాల్సిన రూ.2వేలు సోమవారం సాయంత్రం నాటికి కార్మికులకు చెల్లించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. 2022 మార్చి, ఏప్రిల్ జీతాల బిల్లులు పెట్టి కౌన్సిల్ ఆమోదం తీసుకుంటామని డిఇ అప్పారావు హామీ ఇచ్చారు. దీంతో సమ్మె ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని యూనియన్ ప్రతినిధులు ఎ.జగన్మోహన్రావు, మురళి, అరుణ్ ప్రకటించారు. కమిషనర్‌తో జరిగిన చర్చల్లో అప్పారావు ,సన్యాసిరావు, గౌరీ, శ్రీనివాసరావు, నాయుడు, సత్యనారాయణ, రమేష్, రామ్మోహన్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ఏ రావివలస పంచాయతీలో జగనన్న కాలనీ ఇంటి స్థలాలు పట్టాలను గ్రామ సర్పంచ్, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని 225 మంది పేదలకు పట్టాలను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. గతంలో 119 పట్టాలను అందజేయగా ప్రస్తుతం 106 పట్టాలను అందజేశామన్నారు. జగనన్న కాలనీల ద్వారా పేదలకు విలువైన ఇంటి స్థలాలను అందజేయడం ఎంతో గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు నడుపూరు సత్యనారాయణ నాయుడు, నరసింహనాయుడు, నారు అప్పలరాజు, పైడి నాయుడు, వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందిస్తున్న శివారెడ్డి

చాణక్యకు గేట్‌లో 898వ ర్యాంక్

వేపాడ : ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు చల్లా జగన్ కుమారుడు చాణక్య విహార్ దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గేట్ పరీక్షలో ఆలిండియా 898 ర్యాంకు సాధించాడు. ఆరో తరగతి లోనే నవోదయ ఎంట్రన్స్‌లో ప్రతిభ కనబరచి ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు కింతలిలో చదివి అనంతరం ఇంటర్మీడియట్ విజయవాడలో చదివి 980 మార్కులు సాధించి, జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్స్‌లో 8 వేల ర్యాంకు సాధించి తంజావూర్‌లోని శాస్త్ర యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యాడు. క్యాంపస్ ఎంట్రీలో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేసి సంతృప్తి చెందక తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గేటు ఎగ్జామ్ రాసి ఐఐటీలో ఎంటెక్ చేయాలనే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో శనివారం విడుదలైన గేట్ ఫలితాల్లో ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందాడు.

సిద్ధం కిట్లు పంపిణీ

డెంకాడ: మండలంలోని పినతలవలస పంచాయతీలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు బూత్ కమిటీ సభ్యులకు శనివారం సిద్ధం కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ ప్రజలకు చేసిన ఎమ్మెల్యే విధానాన్ని మరోసారి ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసే విధంగా మోటివేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ సారిక గౌరి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, పాల్గొన్నారు.

ఎల్లారమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: జామి గ్రామంలో వెలసిన ఎల్లారమ్మ జాతర సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఆదివారం జామి నుండి కొత్తవలస, కొత్తవలస నుండి జామికి యాత్రికుల కోసం ప్రత్యేక బస్సులు సాధారణ పల్లెవెలుగు ఛార్జీలతో మొత్తం 8 బస్సులు నడుపుతున్నట్లు ఎస్. కోట డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక బస్సులు రెండు వైపుల నుంచి ఉదయం 5.30 గంటల నుండి నడుపుతున్నామన్నారు. జామి నుండి కొత్తవలసకు ఛార్జి రూ.30 మాత్రమేనని ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు పెంచుతామని చెప్పారు. భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి 8వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పాల్గొన్నారు. తెల్లవారు జాము నుండి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పూజించారు. ఈ కార్యక్రమంలో ఎడువాక వెంకటరమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 137 కేసులు పరిష్కారం

బొబ్బిలి: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 137 కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ, జూనియర్ సివిల్ జడ్జి ఎ.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు ఆధ్వర్యంలో మూడు బెంచలలో లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులను విచారించిన న్యాయమూర్తులు 137 కేసులను రాజీ చేసి పరిష్కరించారు. సత్వర న్యాయం కోసమే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తులు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సిఎం సహాయ నిధి

బొబ్బిలి: పేద ప్రజలకు సిఎం సహాయ నిధి ఆపదలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 38 మంది లబ్ధిదారులకు శనివారం రూ.40.51లక్షల చెక్కులను ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పథకంలో ఎందరో పేదలు ఉచిత వైద్యం పొందుతుంటే మరోవైపు సిఎం సహాయ నిధి ద్వారా అండగా నిలవడం దేశంలో ఎక్కడా లేదన్నారు.

ఏడో సారి పోటీలో కోలగట్ల

విజయనగరం టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామిని ఆపార్టీ అధిష్టానం ప్రకటించింది. మరో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి పోటీ చేస్తుండటంతో మొత్తంగా ఏడోసారి విజయనగరం నియోజకవర్గంలో పోటీలో నిలవనున్నారు. 1989, 1994, 1999లో విజయ నగరం శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు పై విజయం సాధించారు. 2013లో కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎమ్మెల్సీగా పదవి బాధ్యతలు చేపట్టారు. 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి మీసాల గీత చేతిలో ఓటమి చెందారు. తిరిగి 2019లో ప్రస్తుత టిడిపి అభ్యర్థి పి.అదితి గజపతిపై పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మళ్లీ తాజా ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా నిలిచారు.

విద్యుత్ నిఘా శాఖ దాడులు

విజయనగరం : విద్యుత్ నిఘా శాఖ, విద్యుత్ డిపిఇ అధికారులు విజయన గరం సర్కిల్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో సంయుక్తంగా దాడులు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ సిఐ కె.శ్రీను తెలిపారు. ఈ దాడుల్లో తెర్లాం మండలం బూరిపేట, మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామంలో విద్యుత్ చౌర్యం చేస్తున్న నిందితుల నుంచి రూ.1,03,548 అపరాదరుసుం, రూ.10వేల విధించినట్లు తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సర్కిల్ ల్యాండ్ ఫోన్ నెంబర్ 08922-234579 కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల పరిధిలోని నాయుడువలసకు చెందిన మత్స నారాయణరావు (46) చెట్టు మీద నుంచి జారి కిందపడి శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నారాయణ రావు హైదరాబాద్‌లో చక్కెర కర్మాగారంలో పనిచేస్తూ కొద్ది రోజుల క్రితం సెలవు పై సొంత ఊరు వచ్చారు. ఇంటివద్ద ఉన్న చింతచెట్టు కాయలు కోసేందుకు భార్యతో సహా వెళ్లి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కాలుజారి కిందకు పడిపోయారు. చెట్టు కింద పశువుల కట్టే రాటలు ఉండటంతో శరీరంలో గుచ్చుకొని తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందించే లోపు చనిపోయారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి సత్యనారాయణ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

గంట్యాడ: మండలంలోని వసాది, కె.వెలగాడ జంక్షన్ మలుపు వద్ద శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొని పచ్చిపులుసు ఈశ్వరరావు (58) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వివరాల ప్రకారం.. పచ్చిపులుసు ఈశ్వరరావు తన భార్య రమాదేవి ఎస్.కోట నుండి విజయనగరం వెళ్తున్నారు. విజయనగరం నుండి బుత్తుల మహేష్, మని నాని, శివ, ఎస్ కోట బైక్ పై వెళ్తున్నారు. కొండవెలగాడ జంక్షన్ మలుపు వద్ద ఇద్దరు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈశ్వర్‌రావు అక్కడికక్కడే మృతి చెందారు. బుత్తుల మహేష్, నాని, శివ, రమాదేవిలకు తీవ్ర గాయాలయ్యాయి. గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు సంఘటన స్థలానికి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల తో వ్యక్తి అరెస్ట్

రేగిడి: మండలంలోని చిన్న శిర్లాం జంక్షన్ చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు 20 మద్యం బాటిల్స్‌తో పోలీసులకు శనివారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకువెళ్లడంతో దాడులు జరిపి రేగిడి పోలీసు స్టేషన్‌కి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మన్మధరావు తెలిపారు.

దొంగలు హల్‌చల్

- చెడ్డీ గ్యాంగ్ తరహాలో సోంపురంలో దోపిడీ
- బాధితులపై ఆయుధాలతో దాడి
- రెండున్నర తులాల బంగారం చోరీ
- భోగాపురంలో ఇంట్లోకి చొరబడి ఏడు తులాలు దోపిడీ

ప్రజాశక్తి- రామభద్రపురం/భోగాపురం

రామభద్రపురం, భోగాపురం మండలాల్లో శనివారం రాత్రి దొంగలు హల్ చల్ చేశారు. రామభద్రపురం మండల కేంద్రం మూడు రోడ్ల కూడలికి కూతవేటు దూరంలో సోంపురం రహదారి పక్కన ఉన్న బిల్డింగ్‌లో దోపిడి జరిగింది. చెడ్డీ గ్యాంగ్ తరహాలో దోపిడీకి ప్రయత్నించారు. దీంతో బాధితులు అరుపులు, కేకలు వేయడంతో దుండగలు మారణాయుధాలతో వారిని బెదిరించి గాయపరచి, కప్ బోర్డ్‌లు, బీరువాలు చిందరవందర చేసి విలువైన వస్తువులు, డబ్బు దొరకక పోవడంతో మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడు తెంచుకొని పరారయ్యారు. దీనిపై బొబ్బిలి రూరల్ సిఐ

రామభద్రపురం: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రాక్షుల సత్యనారాయణ, భార్య అనురాధ, కుమార్తెతో ఇక్కడ గ్రామ శివారులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఎప్పటి లాగానే ఇంటి గేటు, మెయిన్ డోరు తాళాలు వేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి బెడ్ రూం డోర్ వద్ద శబ్దం రావడంతో సత్యనారాయణకు తెలివి వచ్చి చూసేసరికి ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి మారణాయుధాలు చూపిస్తూ హిందీ భాషలో మాట్లాడుతూ బెదిరించారు. భయానికి గురై షాక్‌తో తన భార్య అనురాధ కేకలు, అరుపులు చేస్తూ సెల్ ఫోన్ తీయడంతో ఆమెను రాడ్‌తో గాయ పరచి తన మెడపై కత్తిపెట్టి, కప్ బోర్డ్ బీరువాలు వెతుకుతూ అందులో వస్తువులు చెల్లాచెదురు చేశారు. విలువైనవి ఏవీ దొరక్క పోవడంతో అనురాధ మెడలో ఉన్న పుస్తెలతాడు తెంపుకొని ఏదో హిందీలో అడిగారు. ఈలోగా ఇంటిముందు వెళుతున్న వాహన లైటింగ్ కిటికీ నుంచి కనిపించడంతో పోలీస్ పోలీస్ అని వారిలో వారే అరుస్తూ అక్కడి నుంచి ప్రహరీ గోడ దూకి పరారయ్యారు. ఆ క్షణంలో వాహన లైటింగ్ రాక పోయి ఉంటే వారి చేతుల్లో హతమై ఉండేవాళ్ళమని బాధితులు వాపోయినట్లు సిఐ తెలిపారు. వెంటనే తేరుకొని 100కు ఫోన్ చేయడంతో తెల్లవారు ఝామునే డిఎస్‌పి శ్రీనివాసరావు, సీఐ తిరుమల రావు, ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. ఉదయం జిల్లా కేంద్రం నుంచి సిసిఎస్ సిఐ సత్యనారాయణ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణుల ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. శివారులో ఒంటరిగా ఉన్న ఇంటిని టార్గెట్ చేసి రెక్కీ నిర్వహించి దోపిడీకి సిద్ధమైనట్లు తెలుస్తుందని సిసిఎస్ సిఐ తెలిపారు. బాధితురాలు అనురాధను స్థానిక ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్లూస్ ఆధారంగా దొంగలను గుర్తించి దోపిడీకి పాల్పడిన వారిని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు.

జాతీయ రహదారి పక్కన భారీ చోరీ

భోగాపురం: భోగాపురంలో జాతీయ రహదారి పక్కనే శుక్రవారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. సుమారు ఏడు తులాల బంగారాన్ని దొంగలు దోచుకుపోయారు. దీంతో భోగాపురం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జాతీయ రహదారిలో కోత మిషన్ సమీపంలో వరుపుల సత్యం కుమారుడు వాసుదేవరావు సొంత గృహంలోని రెండో అంతస్తులో నివాసం ఉంటున్నాడు. అత్తవారి ఇంటి వద్ద ఉన్న భార్యను చూసేందుకు కుమార్తెతో కలిసి వెళ్ళాడు. ఆయన తల్లిదండ్రులు కింది ఇంట్లో పడుకోగా తమ్ముడు రాము మూడో అంతస్తులో పడుకున్నాడు. ఇదే అదనుగా దొంగలు రెండో అంతస్తులోని వాసు ఇంటి తలుపు గడియను విరగగొట్టారు. అనంతరం లోపలకు వెళ్లి బీరువా తలుపును సైతం విరగ్గొట్టారు. బీరువాలో ఉన్న బంగారం హారంతో పాటు కుమార్తె గాజులు, ఉంగరాలు దోచుకు పోయారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ ఏ. రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విజయనగరం నుంచి క్లూస్ టీమ్‌ని పిలిపించి వివరాలు సేకరించారు. ఆ ఇంటికి సమీపంలోని సీసీ కెమెరాలను సిఐ పరిశీలించారు. భాదితుడు వాసుదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విలేకరులకు తెలిపారు.

భోగాపురంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

'లెండి'లో 16వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలు కళాశాల ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జెఎన్‌టియు గురజాడ విజయన గరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, గ్లోబల్ టాలెంట్ ప్రతినిధి ఎన్.ఉదయకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్‌లో స్వశక్తితో ముందడుగు వేయాలని, అందుకోసం ప్రయోగాత్మకంగా, పరిశోధనాత్మకంగా విద్యాబోధన సాగాలని, ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకునే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ ప్రక్రియలో విజయాలు, అపజయాలు రెండూ ఉంటాయని, ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి రామారెడ్డి వార్షిక నివేదికను చదివి ఈ విద్యా సంవత్స రంలో అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. సంస్థ చైర్మన్ పి. మధుసూద నరావు మాట్లాడుతూ కేర్, కెరీర్, క్యారెక్టర్ నినాదంతో నిరంతర విద్యా ప్రక్రియతో లెండి కళాశాలను 16 సంవత్సరాలుగా ముందుకు తీసుకెళ్లిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

మాట్లాడుతున్న వీసీ వెంకటసుబ్బయ్య

సిబ్బందిని అభినందించారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం అభినందించి సత్కరించింది. పిహెచ్‌డిలు పొందిన ఉపాధ్యా యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శివ రామకృష్ణ, వైస్ చైర్మన్ పి.శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, వైస్ ప్రిన్సిపల్ అకడమిక్స్ కె.వి.నరసింహం, డీన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తు : గుమ్మడి

ప్రజాశక్తి- మెంటాడ

ఎపి భవిష్యత్ చంద్రబాబుతోనే మార నుందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు, సాలూరు టిడిపి అభ్యర్థి సంధ్యారాణి అన్నారు. శనివారం జి.టి పేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగింది. సంధ్యారాణి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. వైసిపిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం జిటి పేటలో మాజీ ఎంపిటిసి చింతాడ అప్పల నరసమ్మ, వార్డు మెంబర్ దాకారపు సత్యం తోపాటు 200 మంది, జయతి గ్రామానికి చెందిన చాపాన నారాయణరావు తోపాటు 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి సంధ్యారాణి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు సి.హెచ్ వెంకటరావు, అన్నవరం, ముసలి నాయుడు, ఆదినారాయణ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

బొండపల్లి : రాష్ట్ర ప్రగతి కోసమే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టారని గజపతినగరం టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలో రాచకిండాం, కిండాం, అగ్రహారం, రయింద్రం, దేవుపల్లి గ్రామలలో ఆయన ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బొండపల్లి: మాట్లాడుతున్న శ్రీనివాస్

సామాజిక భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు పక్కన కాపు సామాజిక భవనానికి ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుకాపుల సంక్షేమానికి పని చేస్తామన్నారు. సామాజిక భవనం నిర్మాణానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పట్టణంలోని గొల్లపల్లిలో ఉపాధి నిధులు సుమారు రూ.1.15 కోట్లతో బి.టి రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గొల్లపల్లి, వంతరాం రోడ్ జంక్షన్ నుంచి రంగరాయపురం వరకు సుమారు 3 కిలోమీటర్స్ వరకు బి.టి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, 10వ

భూమి పూజ చేస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

వార్డు వైసిపి ఇంఛార్జి తుట్ట తిరుపతి, వైసిపి నాయకులు పైల సురేష్, బి.అప్పారావు, ఎన్.సింహాచలం, ఆర్.రామారావు, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కుంపల్లిలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి కొరత రాకుండా ముందుస్తు చర్యలో భాగంగా తాగునీటి బోరుబావి నిర్మాణానికి ఎంపిపి డి. సత్యవంతుడు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, పంచాయతీ కార్యదర్శి నిసార్ కమల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులు కబ్జా చేసి సంక్షేమ భవనం కడతారా?

ఎమ్‌పికి సుప్రీంకోర్టు తీర్పులు తెలియదా ?

ప్రజాశక్తి- బొబ్బిలి

చెరువులు, బందలు పరిరక్షించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి మున్సిపల్ చైర్ పర్సన్ సంక్షేమ భవనానికి శంకుస్థాపన ఏ విధంగా చేస్తారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కోట అప్పన్న, రైతు కూలీ సంఘం నాయకులు వెలగాడు కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు ఎ.సురేష్ ప్రశ్నించారు. వైసిపి నాయకులు ఓట్లు కోసం కుల రాజకీయాలు మానుకోవాలని అన్నారు. అధికారం కోసం కుల రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేయకండని హితవు పలికారు. మున్సిపల్ కమిషనర్‌ని అడిగి మున్సిపల్ కార్మికులు పార్కు చెరువు గట్టుపై విశ్రాంతి గదికి లక్ష రూపాయలు ఖర్చు చేసి కార్మికులు పునాదులు వేస్తే ఎమ్మెల్యే తక్కువ కులం వాళ్ళని అక్కడ రేకుల షెడ్ కట్టుకోనీయకుండా పోలీసులను పెట్టి తొలగించారని చెప్పారు. అటువంటిది ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులూ లేకుండా ఎమ్‌పి, మున్సిపల్ చైర్ పర్సన్ హుగ్గీ జూట్ మిల్లి పక్కన ఉన్న బంధను కప్పి కాపు సంక్షేమ భవనానికి భూమి పూజ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ మరికొద్ది గంటల్లో రాబోతున్న తరుణంలో చట్టాన్ని ఉల్లంఘించి ప్రభుత్వ చెరువులు కప్పి సంక్షేమ భవనానికి భూమి పూజ చేసిన ఎమ్‌పి, బొబ్బిలి మున్సిపల్ చైర్ పర్సన్ పై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై అన్ని ఆధారాలతో చట్ట ఉల్లంఘనకి పాల్పడుతున్న వారిపై కోర్టులో కేసులు వేస్తామని తెలియజేశారు.

కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న నాయకులు

8 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని 8 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ సూర్యనారాయణ మూర్తి తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ మండలం, నగర పంచాయతీలో 8 కేంద్రాల్లో 1660 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 160, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో 170, బిసి గురుకుల పాఠశాలలో 200, మొయిద జెడ్‌పి పాఠశాలలో 280, రామతీర్థం పాఠశాలలో 220, అలుగోలు పాఠశాలలో 220, పారసాం పాఠశాలలో 120, సతివాడ పాఠశాలలో 290 మంది విద్యార్థులకు కేటాయించినట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లు చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ంగా కేంద్రాలకు చేరుకోవచ్చునని తెలిపారు.

కొత్తవలస: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లునూ పూర్తి చేశామని ఎంఇఒ జి. శ్రీదేవి తెలిపారు. మండలంలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని 963 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. కొత్తవలస జిల్లా పరిషత్ హై స్కూల్లో 236 మంది, ఎపిఎంఎస్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 260 మంది, జిందాల్ భారతి విద్యా మందిర్ లో 232 మంది, వియ్యం పేట జిల్లా పరిషత్ హై స్కూల్లో 235 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని అన్ని సౌకర్యాలూ కల్పించామని చెప్పారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన సమ్మె శని వారం స్థానిక ఆర్ఒబి వద్ద 45వ రోజు కొనసాగింది. మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి. వి. రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేశ్ మాట్లాడుతూ శుక్రవారం విశాఖపట్నం జెసిఎల్ వద్ద చర్చలు జరిగాయని ఆ చర్చల్లో జెసిఎల్ జీతాలు రెండు రోజుల్లోగా చెల్లించి, సమస్యలు పరిష్కారానికి తన వంతు చొరవ చూపించి అప్పటికీ పరిష్కారం జరగక పోతే వచ్చే గురువారం మరోసారి చర్చలు జరుపుతామని చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వం, మిమ్స్ యాజమాన్యం స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించి జనవరి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో ఉద్యోగులు ఎం.నారా యణ, కె. కామునాయుడు, కె.మధు, గౌరి, మూర్తి, ఎం.నాగ భూషణం, అప్పల నాయుడు, వరలక్ష్మి, బంగారునాయుడు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె. సురేష్

ధాన్యం రైతులకు బకాయి బిల్లులు చెల్లించాలి

మెంటాడ: ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాలకు అమ్మిన రైతులకు ఆరు మాసాలు కావస్తున్న బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని వెంటనే వారికి బకాయి బిల్లులు చెల్లించాలని ఎపి కౌలు రైతు సంఘం నాయకులు రాకోటి రాములు, తొత్తిడి పైడిపునాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో 566 మందికి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పంట పండించేందుకు రైతులు వేలాది రూపా యలు మదుపులు పెట్టారని కొంత మంది ఎక్కువ వడ్డీకి డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టారని ఇప్పుడు ధాన్యం డబ్బులు అందక అయోమయ పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. రైతులకు ఇవ్వ వలసిన బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి బిల్లులు చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రచారం

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీలో శనివారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్రంలో బిజెపి పాలనలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన సాగిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఇండి యా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెసుతో ప్రజా పాలన సాధ్యమ న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: స్థానిక ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి. బాల భాస్కర్ రావు శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులకు భోజనం అమలు పనితీరు, పాఠశాలలో సాధారణ ఎలక్షన్ కోసం జరిగిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనం తరం సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు అధ్యక్షతన జరిగిన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఎంఇఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు సల హాలు ఇచ్చారు. మంచి మార్కులతో పాస్ అవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులకు హాల్ టిక్కెట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసి చైర్మన్, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంఇఒ

టిబి రహిత సమాజాన్ని తయారు చేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

టిబి రహిత సమాజాన్ని తయారు చేయాలని టిబి సూపర్ వైజర్ బి. శ్రీనివాస్ అన్నారు. వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల రామలింగాపురం సచివాలయంలో మండల టిబి యూనిట్ సభ్యులు శనివారం చీడివలస ప్రజలకు టిబిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా నిర్ధారించవచ్చునని తెలిపారు. దగ్గినపుడు తుమ్మినపుడు గాలి తుంపరలు ద్వారా ఒకరి నుండి ఇంకొకరికి వ్యాపిస్తుందని తెలిపారు. కఫం పరీక్ష ద్వారా గాని, ఎక్స్‌రే ద్వారా గాని టిబిని నిర్ధారించవచ్చునన్నారు. అనంతరం హెల్త్ అసిస్టెంట్ సత్యారావు టిబి పై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్. ఎస్. ఈశ్వరావు, ఎఎన్ఎమ్. వరలక్ష్మి, ఆశ వర్కర్స్ అప్పన్నమ్మ, జ్యోతి, రాములమ్మ పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- బాడంగి

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు అన్నారు. శనివారం మండలంలోని అనవరం గ్రామానికి సుమారు రూ.70 లక్షలతో 2 కిలోమీటర్లు నిర్మించిన నూతన బిటి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గం జెసిఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, వైసిపి మండల అధ్యక్షుడు బొమ్మినాయని వెంకట నాయుడు, ఇదుబిల్లి లక్ష్మీ, ఇదుబిల్లి శ్రీనివాస్, మండల యువజన అధ్యక్షుడు వంగపండు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మాట్లాడుతున్న బేబినాయన

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

ప్రజాశక్తి- బొబ్బిలి

రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన అన్నారు. స్థానిక తాండ్రపాపరాయ విగ్రహం జంక్షన్‌లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. బొబ్బిలి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అండగా ఉంటున్న తనకు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనను గెలిపించాలని కోరారు.

ప్రత్యర్థి ఎవరైనా విజయం నాదే

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయ నగరం పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రత్యర్థి ఎవరైనా విజయం తనదేనని వైసిపి ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బొబ్బిలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం బిసిలు ప్రాబల్యం ఉన్న నియోజకవర్గమని, రానున్న ఎన్నికల్లో తనపై ఎవరు పోటీ చేసినా బిసి సామాజిక వర్గానికి చెందిన తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఓటర్లు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేస్తారన్నారు.

మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన

రేపు రాజా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాజా కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, హైదరాబాద్‌కు చెందిన వివిధ పరిశ్రమల యాజమాన్యాలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు, ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులకు క్వాలిటీ అస్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ డిపార్ట్మెంట్‌లో నియమిస్తామన్నారు. డిగ్రీ విద్యార్థులకు రూ.18వేలు, పీజీ విద్యార్థులకు రూ.22వేలు వరకు వేతనం చెల్లిస్తారని చెప్పారు. ఏటా పెర్ఫార్మన్స్ ఇంక్రిమెంట్స్ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.